క్లుప్తంగా

నేడు ప్రజాఫిర్యాదుల కార్యక్రమం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలోని వన్‌టౌన్ పక్కన ఉన్న ఉన్న ఆర్మ్‌డు రిజర్వు కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడతామని ఎస్పీ తెలిపారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేద్దాం

ఐరాల: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో త్వరలో నిర్వహించనున్న వజ్రోత్సవ వేడుకలు విజయవంతం చేద్దామని పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు సీతాపతినాయుడు కోరారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయన పూర్వ విద్యార్థులతో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఏర్పాటై 75 వసంతాలు పూర్తయిన సందర్భంగా కార్యవర్గ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. త్వరలో నిర్వహించే వజ్రోత్సవ వేడుకల్లో పూర్వ విద్యార్థులు, దాతలు, విద్యావేత్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

దొరికిన దొంగలు

చిత్తూరు కార్పొరేషన్: రైళ్లలో దొంగతనలు చేస్తూ తప్పించుకు తిరుగుతున్న దొంగలు ఎట్టకేలకు దొరికారు. గత నెల 26వ తేదీన చిత్తూరు రూరల్ మండలం సిద్ధంపల్లె రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్ ట్యాంపరింగ్ చేశారు. అనంతరం రైలులో ప్రయాణికుల నుంచి దాదాపు 50 గ్రాములకు పైగా బంగారు నగలను దొంగలు దోచుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన రైల్వే పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మహారాష్ట్ర సహా పలు ప్రాంతాల్లో గాలించి ఇద్దరు దొంగలను అదుపులో తీసుకున్నారు. సోమవారం దొంగల అరెస్టును పోలీసు గెస్టుహౌస్‌లో మీడియాకు చూపనున్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం



టి.పుత్తూరులో పూర్వ విద్యార్థులతో విశ్రాంత ఉపాధ్యాయుడు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు విజయకృష్ణారెడ్డికి ఆదివారం పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. తవణంపల్లె హైస్కూల్‌లో విజయకృష్ణారెడ్డి సోషియల్ టీచర్‌గా విధులు నిర్వహిస్తూ గత నెల పదవీ విరమణ పొందారు. 1992 నుంచి 2003 వరకు టి.పుత్తూరు పాఠశాలలో విధులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు కోదండ రామాలయ ఆస్థాన మండపంలో గురువుకు పూజలు చేసి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గురువుకు పూర్వ విద్యార్థులు 11 గ్రాముల బంగారు బ్రాస్‌లైట్ చేతికి తొడిగి గురుదక్షిణ సమర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవిచంద్రారెడ్డి, ఆలయ వంశపార్యంపర ధర్మకర్త సిద్దేశ్వర్‌రెడ్డితో పాటు పలువురు సత్కరించి వీడ్కోలు పలికారు.

మన మంచి ప్రభుత్వంలో తమ్ముళ్ల తన్నులాట

చిత్తూరు అర్బన్: మన మంచి ప్రభుత్వంలో తమ్ముళ్లు తన్నుకున్నారు. ఈఘటన శనివారం చిత్తూరు నగరంలోని గిరింపేటలో చోటుచేసుకుంది. పోలీసులకు ఫిర్యాదు అందడంతో విషయం వెలుగుచూసింది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని గిరింపేటలో మేకల జయరాజ్ ఓ బ్యానర్‌ను ఏర్పాటు చేశాడు. ఈ బ్యానర్‌లో టీడీపీ నాయకుడు కాజూరు బాలాజీ ఫొటో లేకపోవడంతో.. అతడి అనుచరులు యువరాజ్, రజిత, మహేష్ ఆ బ్యానర్‌ను చించేశారు. ఈవిషయం తెలుసుకున్న జయరాజ్ వెంటనే కాజూరు బాలాజీ అనుచరులను ప్రశ్నించాడు. దీంతో వారు జయరాజ్‌ను అసభ్యకర పదజాలంతో ధూషించారు. రాత్రి 10 గంటల సమయంలో జయరాజ్ కుటుంబసభ్యులపై వారు కర్రలు, ఇనుప రాడ్లు, ఇటుకలతో దాడి చేశారు. ఈ దాడిలో జయరాజ్ కుటుంబ సభ్యులకు తీవ్రగాయాలవడంతో పాటు ఆస్తి నష్టం కూడా జరగడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అలాగే తమను కొట్టా రంటూ కాజూరు బాలాజీ అనుచరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయరాజ్, వరలక్ష్మి, తదితరు లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేడుకగా బలిబండి

సదుం: మండలంలోని భట్టువారిపల్లె వద్ద పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం భీముని పాత్రధారి బలిబండిపై సమీప గ్రామాల్లో మేళతాళాలతో ఊరేగారు. భక్తులు పూజలు చేసి, ఆహార పదార్థాలను బండికి సమర్పించారు. మధ్యాహ్నం భాగవతారిణి జ్యోత్స్న హరికథాగానం చేశారు. రాత్రి వేంకటేశ్వర నాట్య కళామండలి నాటక ప్రదర్శన అందరినీ అలరించింది.

గణనాథుడికి భలే డిమాండ్

బొజ్జయ్య బొమ్మలకు ఆర్డర్లు పుంజుకుంటున్నాయి. ముందస్తు బుకింగ్‌లపై చవితి నిర్వాహకులు, యువకులు, పిల్లలు ఆసక్తిచూపుతున్నారు. తయారీ కేంద్రాలకు పరుగులు పెడుతున్నారు. వినూత్న విగ్రహాలపై మొగ్గుచూపుతున్నారు. దీంతో తయారీదారులకు చేతినిండా పనిపెడుతున్నారు. ఒక అడుగు నుంచి 18 అడుగులకు వరకు బొమ్మల తయారీలు రూపుదిద్దుకుంటున్నాయి. తద్వారా బొమ్మల తయారీలో జోరు పెరుగుతోంది.

అప్పుడే తయారైన గణేశుడి ప్రతిమలు



- జోరుగా విగ్రహాల తయారీ
- ఇప్పటి నుంచే గణేశుడి ప్రతిమలకు అడ్వాన్స్ చెల్లిస్తున్న పలువురు
- ఒక అడుగు నుంచి 18 అడుగుల వరకు బొమ్మలు తయారీ
- వినూత్న విగ్రహాలపై ఆసక్తి
- చేతి నిండా పని దొరకడంతో బిజీగా తయారీదారులు

కాణిపాకం: చిత్తూరు నగరంలోని కలెక్టర్ ఆఫీసు సమీపంలోని ప్రాంతాలు, గంగసాగరం, ఇరువారం-కాణిపాకం రోడ్డు, బంగారుపాళ్యం రోడ్డు, పెనుమూరు క్రాస్, చిత్తూరు మండలంలోని నాయని చెరువు గ్రామంలో బొమ్మలు తయారు తయారీదారులకు చేతినిండా పని దొరికడంతో బిజీ అయ్యారు. వచ్చే నెల ఆగస్టు 27వ తేదీన చవితి పర్వదినం సందర్భంగా చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల్లో చవితి జరుపుకునేందుకు ఇప్పటి నుంచే సన్నాహాలు చేస్తున్నారు. వినాయక కమిటీలు, నిర్వాహకులు, యువకులు, పిల్లలు చవితి నిర్వహణకు ముందస్తుగా రెడీ అవుతున్నారు. తొలుత నచ్చిన బొమ్మల కోసం వెతుకులాడే పనిలో పడ్డారు. ముందుగానే మంచి బొమ్మలను ఎంపిక చేయాలనే ప్రయత్నాల్లో పడిపోయారు. లేకుంటే చివరి క్షణాల్లో ప్రత్యేకంగా తయారైనా బొమ్మలు దొరకవని చకచకా అడుగులు వేస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి కూడా..

జిల్లాలోని పలమనేరు, బంగారుపాళ్యం, తవణంపల్లి, యాదమరి, జీడీనెల్లూరు, గుడిపాల, వీ.కోట, పూతలపట్టు, ఐరాల తదితర ప్రాంతాల నుంచి బొమ్మల తయారీ కేంద్రాలకు అధిక సంఖ్యలో వస్తున్నారు. తమిళనాడులోని పరదారామి, వేలూరు, కాట్పాడి, తిరుత్తణి, షోలింగర్, వల్లిమలై, గుడియాత్తం, అంబూరు తదితర ప్రాంతాల నుంచి చిత్తూరులోని తయారీ కేంద్రాలతో పాటు నాయని చెరువు గ్రామానికి క్యూకడుతున్నారు. బొమ్మలను బుకింగ్ చేయడంతో పాటు వ్యాపారులు బల్క్ బుకింగ్ చేస్తున్నారు. అడుగు బొమ్మ నుంచి భారీ విగ్రహాలకు వరకు ఆర్డర్లు ఇచ్చి వెళ్లిపోతున్నారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దు..

పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు వద్దని పర్యావరణ ప్రియులు హెచ్చరిస్తున్నారు. పండుగ పేరుతో ప్రకృతికి హాని కలిగించవద్దని ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కట్టమంచి చెరువులో గతేడాది ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలు కరగకుండా తేలాయి. ఇందులో భాగంగా పర్యావరణ ప్రియులు అలాంటి బొమ్మలు వద్దంటున్నారు. పిండి, మట్టితో తయారు చేసిన బొమ్మలు మేలంటున్నారు. ఈనేపథ్యంలో పలువురు విగ్రహా తయారీదారులు పిండి, కొబ్బరి నారు, కొయ్యలతో భారీ విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టారు. వాటర్‌బేస్ట్ పెయింట్‌ను హైదరాబాద్ నుంచి తెప్పించి పర్యావరణానికి హాని కలిగించకుండా బొమ్మలు తయారీ చేస్తున్నట్లు నిర్వాహకులు చెబుతున్నారు.



ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్న తయారీదారులు



అమ్మకానికి రోడ్డుపై ఉంచిన విగ్రహాలు

చేతినిండా పని..

ఆర్డర్లు వరుస కట్టడంతో తయారీ కేంద్రాలకు చేతినిండా పని పడింది. ఆర్డర్లు తీసుకుని చవితి నిర్వాహకులకు నచ్చిన బొమ్మలను పక్కన పెట్టేస్తున్నారు. లేకుంటే వారి ఆర్డర్ ప్రకారం బొమ్మలు తయారీని ప్రారంభిస్తున్నారు. ఆర్డర్లు ఇచ్చిన వాటికి రంగులు వేసి సిద్ధంగా ఉంచుతున్నారు. నాయని చెరువులో ఇంటిల్లిపాది బొమ్మలు తయారీ చేసున్నారు. ఆర్డర్లు పుంజుకోవడంతో అక్కడక్కడ బొమ్మలు తయారీ చేస్తున్న తయారీదారులు మాత్రం రాజస్థాన్, హైదరాబాద్ నుంచి బొమ్మలు తయారీ చేస్తే వ్యక్తులను రప్పించారు. వీరు జనవరి నుంచి బొమ్మల తయారీని ప్రారంభించారు. అన్ని తయారీ కేంద్రాలు బొమ్మలతో కళకళలాడుతున్నాయి. తయారు చేసిన విగ్రహాలతో నిండుకుంటున్నాయి. ఇందులో పార్వతీ పరమేశ్వరుడి పుత్రుడిగా, శివాతారంలో వినాయకుడు, నాగేశ్వరుడి అవాతరం, వృషభవాహనంలో గణనాయకుడు, బాహుబలి ఆకారంలో గణేశుడు వంటి బొమ్మలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇందుకు వస్త్రధారణ చేసి ప్రజలను ఆకట్టుకునేలా తయారీదారులు అమ్మకానికి పెట్టారు. ఆర్డర్లు చూస్తే ముందస్తుగానే వినాయక చవితి సందడి నెలకొంది.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

గుడిపాల: మండలంలోని నరహరిపేట వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు చిత్తూరు నియోజకవర్గ సమన్వయకర్త విజయానందరెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు గుడిపాల మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ప్రకాష్ తెలిపారు. కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో క్యూఆర్ కోడ్ ద్వారా డాక్యుమెంటేషన్ రిలీజ్ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

అలరించిన త్యాగరాజ సంకీర్తనం



కీర్తనలను ఆలపిస్తున్న కళాకారులు

పలమనేరు: పట్టణంలోని కళామందిరంలో ఆదివారం నిర్వహించిన త్యాగరాజ సంకీర్తన కచేరి కర్ణపేయంగా సాగింది. జాయినింగ్ ద డాట్ ఫౌండేషన్, తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ కర్ణాటక సంగీత విద్వాంసులు సాయితేజస్ చంద్రశేఖర్ గానం, అర్జున్ దినకరన్ వయోలిన్, నాగరాజు మృదంగం, సుమనా చంద్రశేఖర్ ఘటంపై సహకారం అందించారు. కార్యక్రమంలో పలువురు సాహిత్య, సంగీత అభిమానులు పాల్గొన్నారు.

వినాయకుడి సేవలో పలువురు ప్రముఖులు



మెప్మా డైరెక్టర్ తేజ్ భరత్

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని ఆదివారం రాష్ట్ర మెప్మా డిపార్మెంట్ మిషన్ డైరెక్టర్ తేజ్ భరత్ దర్శించుకున్నారు. అలాగే రాష్ట్ర హైకోర్టు రిటైర్డు జడ్జి శేషసాయి కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చారు. వీరికి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. స్వామి ఆశీర్వచనాలతో పాటు స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో డీఈఓ సాగర్‌బాబు, ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల రద్దు అధికారం కలెక్టర్లకు..!

చిత్తూరు కలెక్టరేట్: భూ ఆక్రమణలను అడ్డుకునేందుకు కొత్త రిజిస్ట్రేషన్ చట్టాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నారు. ఈ చట్టం ప్రకారం ఎవరైనా అక్రమంగా భూములను రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అటువంటి వాటిని కలెక్టర్ నేతృత్వంలో కమిటీకి రద్దు చేసే అధికారాన్ని ప్రభుత్వం కల్పించినట్లు అధికారులు వెల్లడిస్తున్నారు. అక్రమదారులతో నిజమైన హక్కుదారులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు వస్తున్నాయి. ఇటీవల రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన రెవెన్యూ సమీక్షలో కొత్త రిజిస్ట్రేషన్ చట్టం అమలుపై కలెక్టర్లకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆ ఆదేశాలను అమలు చేసేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది.

ఇప్పటి వరకు సివిల్ కోర్టుకు

సాధారణంగా భూములు అక్రమంగా ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయించుకుంటే సంబంధిత బాధితులు సివిల్ కోర్టును ఆశ్రయించేవారు. పలు కేసులు విచారణ ముగిసేకి సమయం పడుతుండేది. దీంతో ఆలోపు సంబంధిత భూములు పలువురు చేతులు మారిపోయేవి. అలాంటి పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు కలెక్టర్ నేతృత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేయనున్నారు. అలా ఏర్పడే కమిటీ అక్రమ రిజిస్ట్రేషన్లు ఎక్కడైనా జరిగితే విచారణ చేసి రద్దు చేస్తుందని కలెక్టరేట్ అధికారులు వెల్లడిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన చంద్రమౌళి

తవణంపల్లె: తిరుపతి-బెంగళూరు హైవే రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. వివరాలు.. కొందరు తిరుపతి నుంచి కారులో స్వర్ణ దేవాలయం వెళ్తుండగా పాకాల మండలం దామలచెరువుకు చెందిన జీ.చంద్రమౌళి(31) ద్విచక్రవాహనంలో ఆపోజిట్ మార్గంలో అతివేగంగా వచ్చి హైవేలోని నత్తపుచేను రోడ్డు దగ్గర కారును ఢీకొన్నాడు. ప్రమాదంలో చంద్రమౌళి తీవ్రంగా గాయపడడంతో రక్తస్రావం అధికంగా జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. కారు డ్రైవర్ గోవర్ధన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు చెప్పారు.



పోటీల్లో ప్రదర్శనలు ఇస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న శాస్త్రీయ పోటీలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని రెవన్యూ భవనంలో ఆదివారం ప్రజాహిత సేవా సంస్థ ఆధ్వర్యంలో శాస్త్రీయ పోటీలు నిర్వహించారు. నగర నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు తనదైన శైలిలో ప్రదర్శనలు ఇచ్చారు. కూచిపూడి, భరనాట్యంతో అదుర్స్ అనిపించారు. ఆహుతులను మెప్పించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన వారికి నగదు సంస్థ అధ్యక్షుడు రాజారత్నంరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలి




వినతిపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు 30 శాతం మధ్యంతర భృతి వెంటనే మంజూరు చేయాలని ఎస్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు ఆదివారం ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి దృష్టికి క్షేత్రస్థాయి సమస్యలు తీసుకెళ్లారు. కాకినాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంతవరకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అందాల్సిన ఆర్థిక ప్రయోజనాలకు సంబంధించి మౌనం వహించడం దారుణమన్నారు. వెంటనే 30 శాతానికి తగ్గకుండా 12వ పీఆర్సీ మధ్యంతర భృతిని మంజూరు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ (కరువుభత్యం)ను పెరిగిన ధరల దృష్ట్యా వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్‌సీ కమిషన్‌ను వెంటనే నియమించాలన్నారు. పీఎఫ్, ఏపీజీఎల్ఐ రుణాలను వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఉద్యోగ విరమణ పొందిన టీచర్లకు, ఉద్యోగులకు గత సంవత్సర కాలంగా రావాల్సిన గ్రాట్యూటీ, అర్ధవేతన సెలవు నగదు, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న రూ.25 వేల కోట్లను దశల వారీగా మంజూరు చేయాలన్నారు. టీచర్లకు యాప్‌ల భారం తగ్గించి బోధనకు సమయం కల్పించాలన్నారు. ఎఫ్ఎల్ఎన్, లీడర్‌షిప్ వంటి శిక్షణా కార్యక్రమాలను రద్దు చేసి విద్యార్థులకు నిర్దేశించిన సమయానికి సిలబస్ పూర్తి చేసేలా సహకరించాలన్నారు. అనంతరం రాష్ట్ర నేతలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యంరాజు, రాష్ట్ర నాయకులు కడియాల మురళి పాల్గొన్నారు.

మామిడి రైతుల కష్టాలపై స్పందించరా ?

- మా నాయకుడు జగనన్న రైతుల కష్టాలు తెలునుకునేందుకు రాకూడదా ?
- ఎమ్మెల్యే మురళీమోహన్‌పై మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ఫైర్



బంగారుపాళెం: మామిడి రైతుల కష్టాలపై స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ ఎప్పుడైనా స్పందించారా ? అని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం బంగారుపాళెంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో అధికార పక్షానికి ఎంత విలువుంటుందో, ప్రతిపక్షానికి కూడా అంతే బాధ్యత ఉంటుందన్నారు. మామిడి రైతుల కష్టాలను తెలుసుకునేందుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెంకు వచ్చారన్నారు. అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో మామిడి రైతుల సమస్యలు ఉన్నాయని స్వయంగా ఎమ్మెల్యేనే చెప్పారన్నారు. మరి రైతుల సమస్యలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యేకి ఎందుకు బాధ ? మీ గురించి మాట్లాడేందుకు జగన్‌మోహన్ రెడ్డి రాలేదు కదా అని అన్నారు. ఎస్సీ నియోజకవర్గాలకు ప్రతిపక్ష పార్టీల వారు రాకూడదనే చట్టం ఉందా అని మండిపడ్డారు. రాష్ట్రంలోనే రెండో పెద్ద మామిడి మార్కెట్ బంగారుపాళెంలో ఉంది గనుక, ఇక్కడ ఫ్యాక్టరీలు, ర్యాంప్‌లు ఎక్కువగా ఉన్నందున.. సమస్యలు కూడా ఇక్కడే ఎక్కువగా ఉండడం వల్ల మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చారని తెలిపారు. దీన్ని కూడా తప్పుపట్టడం అధికార పార్టీ వారికే చెల్లిందన్నారు. తమ నాయకుడు జగనన్న బంగారుపాళెం పర్యటన తరువాతే మామిడి ధరలకు రెక్కలొచ్చాయని గుర్తు చేశారు. ఫ్యాక్టరీ యజమానుల దగ్గర డబ్బులు తీసుకుని మీరు రైతులకు అన్యాయం చేసింది నిజం కాదా? అని అన్నారు. దీనిపై కాణిపాకంలో సత్య ప్రమాణానికి సిద్ధమా ? అని సవాల్ విసిరారు. నియోజకవర్గంలో ఏనాడైనా దళితుల సమస్యలను గురించి పట్టించుకున్నావా అని ఎమ్మెల్యేని ఆయన సూటిగా ప్రశ్నించారు. రైతులకు ఇస్తామన్న రాయితీ డబ్బులు ఇంత వరకు ఇవ్వలేదన్నారు. రైతులపై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

అశ్వవాహనంపై కోదండరాముడి చిద్విలాసం





కోదండ రామాలయంలో ఊయల సేవలు సీతారామలక్ష్మణులు, ఉయ్యాల సేవలో పాల్గొన్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని టి.పుత్తూరులో వెలసిన కోదండరాముల దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అశ్వవాహనంపై కోదండరాముడు కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగారు. ఆలయంలో ఉదయం అర్చకుడు సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఉభయదారులచే స్వామికి తిరుమంజనం పాలాభిషేకం చేయించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం 11 గంటలకు స్వామివారి ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం ఉభయదారులచే ఊంజల్‌సేవ భక్తితో చేపట్టారు. ఉభయదారులు స్వామికి గజమాలలు, సుగంధ పరిమళ పుష్పాలతో పాటు పూజాసామగ్రి, పట్టువస్త్రాలు, ప్రసాదాలు ఊరేగింపుగా తీసుకొచ్చి సమర్పించారు. అర్చకులు అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తులకు అభయమిచ్చిన కోదండరాముడు

కోదండరాముల ఆలయంలో ఆదివారం రాత్రి అశ్వవాహనం సేవలు ఘనంగా నిర్వహించారు. ఉభయదారులు స్వామికి పూజా సామగ్రి, ప్రసాదాలు, సుగంధ పరిమళ పుష్పాలను ఊరేగింపుగా తీసుకొచ్చి స్వామికి సమర్పించారు. అర్చకులు స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. విద్యుత్ దీపాలంకరణ, గజమాలలతో అలంకరించిన అశ్వవాహనంపై స్వామివారు కొలువుదీరారు. సోమవారం ఉదయం తిరుమంజనం, పాలాభిషేకం, మధ్యాహ్నం మోహిని ఉత్సవం, సాయంత్రం వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహించనున్నట్లు ఆలయ వంశపార్యంపర ధర్మకర్త సిద్దేశ్వర్‌రెడ్డి తెలిపారు. రాత్రి ధ్వజావరోహణం, ఏకాంత సేవ నిర్వహిస్తామన్నారు.

దారి కల్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న గువ్వకల్లు వాసులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తమ కాలనీకి వెళ్లేందుకు రోడ్డు మార్గం లేదని, ప్రస్తుతం వెళ్తున్న దారిలో గుంత తవ్వేస్తున్నారని చిత్తూరు మండలం గువ్వకల్లు కొత్త కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు దారి సమస్య పరిష్కరించాలని కోరుతూ రోడ్డెక్కారు. గత ప్రభుత్వం పేదలుగా గుర్తించి 40 కుటుంబాలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందన్నారు. ఈ కాలనీకి కరెంటు సౌకర్యంతో పాటు నీటి వసతి కూడా కల్పించిందన్నారు. ఇక్కడ కాలనీ ఏర్పాటు చేసే సమయంలో మ్యాప్‌లో రెవెన్యూ, హౌసింగ్ అధికారులు దారి కూడా చూపించారన్నారు. చిత్తూరు-తచ్చూరు ఏర్పాటుతో ఇప్పుడు దారి లేకుండా చేస్తున్నారన్నారు. నేషనల్ హైవే అధికారులు కూడా ఇన్నాళ్లు రోడ్డు ఉందని, సర్వీసు రోడ్డు ఇస్తామని చెప్పి ఇప్పుడు లేదంటున్నారని వాపోయారు. ఇక్కడ ఇళ్లు కట్టుకున్న వాళ్లంతా దినసరి కూలీ చేసేవాళ్లమని, అధికారులు స్పందించి దారి చూపాలని వారు వేడుకుంటున్నారు.